సాక్షి
పెద్దపల్లి
శనివారం । 1 । ఏప్రిల్ । 2023



పోచమ్మకు బోనం

వేములవాడ: వేములవాడ బద్దిపోచమ్మ వద్ద శుక్రవారం రద్దీ నెలకొంది. శివపార్వతులు, జోగినులు, హిజ్రాలు బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు.



పత్తి క్వింటాల్‌కు రూ.7,407

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మార్కెట్‌లో శుక్రవారం పత్తి క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.7407, కనిష్టంగా రూ.6,811 సగటు ధర రూ.7,307 నమోదైంది.

గరిష్టం/కనిష్టం
37.0/22.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా ఉంటుంది. పగటి పూట ఎండ తీవ్రత పెరుగుతుంది.

ఎక్కువగా నమ్మటం, ఎక్కువగా ప్రేమించటం, ఎక్కువగా ఆశించటం ద్వారా వచ్చే బాధ కూడా ఎక్కువగానే ఉంటుంది.
– మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
శని 6:33	ఆది 4:45

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

3లోగా పంటనష్టం వివరాలివ్వండి



మాట్లాడుతున్న కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాలు, వడగండ్ల వానలకు నష్టపోయిన పంటల వివరాలు, రైతులపేర్లు, బ్యాంకుఖాతా వివరాలను ఈ నెల 3లోగా సమర్పించాలని కలెక్టర్ సంగీత సంబంధిత వ్యవసాయాధికారులను ఆదేశించారు. వానలకు 33శాతం నష్టపోయిన పంటల వివరాలను మాత్రమే నివేదించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చిందని, ఆ వివరాల ఆధారంగా ఎకరానికి రూ.10వేల పరిహారం అందించాలని సీఎం నిర్ణయించారని వివరించారు. ఇప్పటివరకు 6,911 ఎకరాల్లో జిల్లా వ్యాప్తంగా పంట నష్టపోయినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చామని జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి పేర్కొన్నారు. ఏఈఓలు తమ క్లస్టర్ పరిధిలో పూర్తివివరాలను ఈనెల 3లోగా అందించాలని కలెక్టర్ సంగీత అన్నారు. పంటలను కౌలురైతులే సాగు చేస్తే కౌలురైతుల బ్యాంకుఖాతా వివరాలనే అందించాలన్నారు. సమావేశంలో ఉద్యానవన అధికారి జగన్మోహన్‌రెడ్డి, ఏడీఏ శ్రీనాథ్, ఏఓ, ఏఈఓలు పాల్గొన్నారు.

ఇంటర్ బ్రిడ్జి పరీక్షలకు 695 మంది హాజరు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఇంటర్మీడియట్ బ్రిడ్జి కోర్సు పరీక్షలకు గురువారం 695 మంది విద్యార్థులు హాజరయ్యారని ఇంటర్ నోడల్ అధికారి కల్పన తెలిపారు. 771 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 76మంది గైర్హాజరయ్యారని, పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని పేర్కొన్నారు.

నిజాయతీ చాటుకున్న మహిళా కండక్టర్



చెవి కమ్మలు అందిస్తున్న కంట్రోలర్ కేఆర్ రెడ్డి

మంథని: మంథని ఆర్టీసీ డిపోకు చెందిన మహిళా కండక్టర్ నిజాయతీ చాటుకుంది. మండలంలోని నాగేపల్లి గ్రామానికి చెందిన కాపురం రాజమ్మ బస్సులో బంగారు చెవికమ్మలు పోగొట్టుకుంది. కండక్టర్ సరితకు కమ్మలు దొరకడంతో బాధితురాలికి అందజేసింది. వివరాలు.. రాజమ్మ పెద్దపల్లి నుంచి మంథనికి బస్సులో ప్రయాణం చేసింది. బస్సు దిగిన తర్వాత చెవులకు కమ్మలు లేకపోవడంతో హైరానా పడింది. విషయం కంట్రోలర్ కేఆర్ రెడ్డికి తెలుపుగా సదరు బస్సు ముత్తారం మండలం ఓడెడుకు వెళ్తున్న క్రమంలో వెంటనే అప్రమత్తమై చెవి కమ్మలను వెతికి బాధితురాలికి అందజేశారు.

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- 47 పరీక్షా కేంద్రాలు.. 7,937 మంది విద్యార్థులు
- కంట్రోల్ రూం నం. 86398 62145
- కలెక్టర్ సంగీత

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ఈనెల 3 నుంచి మొదలయ్యే 10వ తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసి సజావుగా సాగేలా చూడాలని కలెక్టర్ సంగీత సంబంధిత అధికారులను ఆదేశించారు. టెన్త్ పరీక్షల ఏర్పాట్లు తదితర అంశాలపై కలెక్టర్ శుక్రవారం మాట్లాడారు. ఈనెల 3 నుంచి 13 వరకు జరిగే టెన్త్ పరీక్షల కోసం జిల్లాలో 47 కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఆయా కేంద్రాల్లో 7,937 మంది విద్యార్థులు హాజరవుతారని వివరించారు. కేంద్రాల వద్ద ఏఎన్ఎం ఆధ్వర్యంలో వైద్యబృందం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని వివరించారు. సమస్యలు, సందేహాలకు కంట్రోల్ రూం నం. 86398 62145 ఫోన్ చేసి తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

ఎంత పనిజేత్తివి బిడ్డా..

నిజామాబాద్‌లో ఉరేసుకొని మెడికో ఆత్మహత్య | మిన్నంటిన తల్లిదండ్రుల రోదనలు



సనత్ మృతదేహం వద్ద రోదిస్తున్న తండ్రి రమేశ్

సాక్షి, పెద్దపల్లి: 'ఎంత పనిజేత్తివి బిడ్డా.. నీకు ఏ కష్టమొచ్చిందని మమ్మల్ని వదిలి వెళ్లావు.. ఈనెలలో తిరుపతికి పోదామంటే టికెట్లు కూడా బుక్ చేసిన గదా బిడ్డా..' అంటూ ఆ తండ్రి రోదించిన తీరు కంటతడి పెట్టించింది. స్థానికుల వివరాలు.. రామగిరి మండలం సెంటినరీకాలనీకి చెందిన మోసం రమేశ్–సుజాత దంపతుల చిన్నకుమారుడు సనత్ (23) నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం వేకువజామున హాస్టల్ గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తల్లిదండ్రులకు తెలియడంతో నిజామాబాద్ చేరుకొని సనత్ మృతదేహం వద్ద గుండెలవిసేలా రోదించారు. వారి రోదనను ఆపడం అక్కడున్నవారితరం కాలేదు.

- 36 రోజుల వ్యవధిలో ఇద్దరు మెడికోల బలవన్మరణం
- పది నెలల కిత్రం అనుమానాస్పద స్థితిలో వైద్య విద్యార్థిని మృతి
- నిజామాబాద్ మెడికల్ కళాశాలలో అలజడి

వరుస ఘటనలు

నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మోగుతున్న మరణమృదంగం కలవరపెడుతోంది. విద్యార్థుల వరుస ఆత్మహత్యలు అలజడి రేపుతున్నాయి. కేవలం 36 రోజుల వ్యవధిలో ఇద్దరు వైద్య విద్యార్థులు ఉరేసుకుని చనిపోవడంతో విషాదం నెలకొంది. శుక్రవారం వేకువజామున మోసం సనత్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గత ఫిబ్రవరి 25న ఇదే హాస్టల్‌లో దాసరి హర్ష అనే ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. హర్ష మంచిర్యాల జిల్లా జన్నారం మండలం చింతగూడకు చెందినవాడు. వీరిద్దరూ ఎందుకు ఆత్మహత్యలు చేసుకున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇక మరోవైపు 2022 మే 13న



రోదిస్తున్న తల్లి

డాక్టర్ శ్వేత అనే మెడికల్ పీజీ విద్యార్థిని అనుమానాస్పదంగా గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రిలోని ప్రసూతి విభాగంలో విధినిర్వహణ సమయంలోనే అర్థరాత్రి మృతిచెందడం గమనార్హం. శ్వేత కరీంనగర్‌కు చెందిన నిరుపేద కుటుంబం నుంచి వచ్చి అత్యుత్తమ ప్రతిభతో పీజీ సీటు సాధించింది. ఇప్పటికీ శ్వేత మరణంపై ఒక స్పష్టత లేకపోవడం గమనార్హం. పీజీ మెడికల్ పూర్తయ్యే సమయంలో శ్వేత మరణించడం పలువురిని చలింపజేసింది.



సనత్ తల్లిని ఓదార్చుతున్న కళాశాల సిబ్బంది

చదువులో ప్రతిభావంతుడు

బలవన్మరణం చెందిన మెడికల్ కళాశాల విద్యార్థి మోసం సనత్ మొదటి నుంచి చదువులో ముందంజలో ఉన్నాడు. 2016లో పదో తరగతిలో 9.2 జీపీ, ఇంటర్‌లో 977 మార్కులు, ఆల్ ఇండియా నీట్‌లో 82,097 ర్యాంక్ సాధించాడు. ఎంబీబీఎస్ రెండో సంవత్సరం వరకు చదువులో ముందంజలో ఉన్నాడు. ఇటీవల ఫైనల్ పరీక్షలు రాశాడు. శనివారం నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. గురువారం స్నేహితులతో సరదాగా గడిపిన సనత్ సినిమాకు వెళ్లాడు. సాయంత్రం క్రికెట్ ఆడాడు. అంతలోనే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. అందరితో కలిసిమెలిసి ఉండే సనత్ అకస్మాత్తుగా ఆత్మహత్య చేసుకోవడంపై స్నేహితులు, తోటి మెడికోలు బోరున విలపించారు.

అంతుపట్టని మరణాలు

ఇక 2022లోనే కళాశాలలో చదువుతున్న మెడికల్ పీజీ ఫైనల్ ఇయర్ విద్యార్థి రోహిత్‌రెడ్డి ఆర్మూర్ మండలం అంకాపూర్ వద్ద రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఇక 2013లో మొదటి బ్యాచ్‌కు చెందిన ఓ వైద్య విద్యార్థిని కుటుంబ కలహాలతో హైదరాబాద్‌లో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అయితే వరుసగా శ్వేత, హర్ష, సనత్ మరణాలు మాత్రం తోటి విద్యార్థులను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. వీరి ముగ్గురి మరణాలు అంతుపట్టకుండా ఉండడంతో ఏం జరుగుతోందనే గందరగోళ వాతావరణం కళాశాలలో నెలకొంది. 2013లో 100 సీట్లతో నిజామాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రారంభమైంది. తర్వాత పీజీ విద్య సైతం ప్రారంభమైంది. నగరం నడిబొడ్డున ఉన్న కళాశాలలో విద్యార్థుల వరుస మరణాలపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పటి వరకు తోటి విద్యార్థులతో చలాకీగా ఉండడంతో పాటు వైద్యసేవలు సైతం అందజేస్తూ అకస్మాత్తుగా మరణిస్తుండడంపట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. ఒత్తిడి తట్టుకోలేక మరణిస్తున్నారా లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనేది తెలియాల్సి ఉందని పలువురు అంటున్నారు.

ఎంతకైనా తెగించుడే..!



ఈ ఫొటోలోని మహిళ పేరు కూరపాటి సరిత. ఊరు అంతర్గాం. 2016లో అధికారుల సమక్షంలో డబుల్ బెడ్రూం లబ్ధిదారుగా ఎంపికైంది. ప్రస్తుతం పాత జాబితా చెల్లదని, కొత్తగా దరఖాస్తు చేసుకుంటే ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్న వారితో కలిపి డ్రా తీసి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని అధికారులు ప్రకటించడంతో ఆందోళన చెందుతుంది. అధికారుల ప్రకటన తమను మోసం చేయడమే అని ఆవేదన వ్యక్తం చేసింది. తమ పేరుతో నిర్మించిన ఇళ్లు తమకు కేటాయించేదాకా ఎంతకైనా తెగిస్తాం అని స్పష్టం చేసింది. అందుకే అసంపూర్తి ఇళ్లలోనైనా ఉండేందుకు మకాం మార్చినం అని పేర్కొంది. డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయంలో రిలే దీక్షలో పాల్గొంది.

- అధికారుల నిర్ణయంతో గత లబ్ధిదారుల ఆందోళన
- తమకు కేటాయించిన తర్వాతే మళ్లీ డ్రా తీయాలని డిమాండ్
- అంతర్గాంలో 'డబుల్' పంచాయితీ
- మండల కేంద్రంలోని డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయంలో రిలే దీక్ష

రామగుండం: 'ఎమ్మెల్యే సార్ మీకు దండం పెడతాం.. ఏడేళ్ల కింద గ్రామపంచాయతీల్లో డ్రా తీసి లబ్ధిదారులను ఎంపిక చేసిండ్లు. గప్పుడు అప్పటి తహసీల్దార్ సమక్షంలోనే గీ తంతు జరిగింది. ఆ తర్వాతే లబ్ధిదారుల సంఖ్యకు అనుగుణంగా అంతర్గాం మండల కేంద్రంలో డబుల్ ఇళ్ల నిర్మాణం మొదలైంది. గానాటి సంది మా ఇళ్ల నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందంటూ కళ్లలో వత్తులు వేసుకొని చూస్తున్నాం.. అధికారులు గిప్పుడు మాటమార్చి ఆనాటి డ్రా రద్దు చేసినం.. మీరు మళ్లీ దరఖాస్తు చేసుకుంటే ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్న అందరితో కలిపి డ్రా తీస్తామంటూ చెప్పడంతో మాకు కంటి మీద కునుకులేకుండా పోయింది. మాలాంటి ఇళ్లు లేనోళ్లను ప్రభుత్వం మోసం చేసుడు ఎంతవరకు కరెక్టో చెప్పుండ్రి' అంటూ వచ్చిన వారందరికీ తమ గోడు వెల్లబోసుకుంటున్నారు. గతంలో డ్రాలో పేరొచ్చిన మూడు గ్రామాల లబ్ధిదారులు అసంపూర్తి గృహాలైనా అందులోనే తలదాచుకుందామని నిర్ణయించుకొని మకాం మార్చినమంటూ స్పష్టం చేశారు. కాగా అంతర్గాం మండల కేంద్రంలో నిర్మితమవుతున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల పంచాయితీ తారాస్థాయికి చేరేలా కనిపిస్తోంది.



రిలే దీక్షలో పూర్వపు లబ్ధిదారులు

గత లబ్ధిదారుల రిలే దీక్ష

అంతర్గాం మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయ ప్రాంగణంలో శుక్రవారం నుంచి రిలే దీక్షలను ప్రారంభించారు. గృహ నిర్మాణాలకు ముందే 2016లో తహసీల్దార్ సమక్షంలో లబ్ధిదారులను ఎంపిక చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తమకు కేటాయించిన తర్వాత మిగతావారికి డ్రా విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీక్షలో గోలివాడ, టీటీఎస్ అంతర్గాం, విలేజి అంతర్గాం గ్రామాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

ఏడేళ్లు గడిచినా అసంపూర్తిగానే..

కార్పొరేషన్‌లో డ్రా నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేసినా అంతర్గాం మండల కేంద్రంలో నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో ఇంకా ఏలాంటి నిర్ణయం తీసుకోలేదు. టీటీఎస్ అంతర్గాం, విలేజీ అంతర్గాం, గోలివాడ మూడు గ్రామాల పేరిట మొత్తం 80 గృహాలు నిర్మాణ దశలోనే ఉన్నాయి. కాగా కాంట్రాక్టర్‌కు లక్షలాది రూపాయల బిల్లు పెండింగ్ ఉండడంతోనే పూర్తి చేసేందుకు వెనుకంజ వేస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై సంబంధిత కాంట్రాక్టర్‌ను వివరణ కోరేందుకు 'సాక్షి' ప్రయత్నించగా స్పందించలేదు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు..



2016లో ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఇళ్లు కేటాయిస్తున్నట్లు ఎలాంటి అధికారిక పత్రాలు జారీ చేయలేదు. ప్రభుత్వ నిబంధనల మేరకు మళ్లీ దరఖాస్తు చేసుకుంటే ఇప్పుడు దరఖాస్తు చేసుకున్నవారితో కలిపి డ్రాలో ఎంపిక చేస్తాం. శాంతిభద్రతలకు ఆటంకం కలిగించేలా వ్యవహరిస్తే ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటారు. పూర్వపు లబ్ధిదారులకు గృహాలు కేటాయించే అధికారం నా పరిధిలో లేదు.

– వేణుగోపాల్, తహసీల్దార్, అంతర్గాం

ఏడేళ్ల నుంచి ఆశతో ఉన్నాం



2016లో మా గ్రామ పంచాయతీలో డ్రా తీసి లబ్ధిదారులను ఎంపిక చేశారు. నాటి నుంచి నేటి వరకు తలదాచుకునేందుకు మాకు ఇల్లు దక్కుతుందని మా కుటుంబం ఎంతో ఆశతో ఉన్నాం. కానీ అధికారుల నిర్ణయంతో మా గుండెల మీద బండరాయి వేసినట్లయింది. దీనిపై అధికారులు పునరాలోచించాలి.

– దూస లక్ష్మి, లబ్ధిదారు, విలేజ్ అంతర్గాం

మాట నిలబెట్టుకోవాలి



ఏడేళ్ల కిందట ఇదే ప్రభుత్వ అధికారులు డ్రా తీసి అందరి సమక్షంలో మమ్మల్ని లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. అదే మాటను అధికారులు నిలబెట్టుకొని ముందుగా మాకు కేటాయించిన తర్వాత మిగిలిన గృహాలకు డ్రా తీసి కొత్త లబ్ధిదారుల ఎంపిక చేయాలి.

– మాద లక్ష్మి, లబ్ధిదారు, గోలివాడ

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చక్రపాణి



గోదావరిఖనిటౌన్(రామగుండం): గోదావరిఖని బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మేడ చక్రపాణి, ప్రధాన కార్యదర్శిగా బోడ సమ్మయ్య ఎన్నికయ్యారు. కోర్టు ఆవరణలో శుక్రవారం జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో మొత్తం 199 ఓట్లకు 184 పోలైనట్లు ఎన్నికల అధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. అధ్యక్ష పదవికి మేడ చక్రపాణి, వేల్పుల మురళీధర్‌యాదవ్, సీహెచ్.శైలజ పోటీ చేయగా చక్రపాణి 94 ఓట్లతో విజయం సాధించారు. వైస్ ప్రెసిడెంట్‌గా గుల్ల రమేశ్, జనరల్ సెక్రటరీగా బోడ సమ్మయ్య, జాయింట్ సెక్రటరీగా ప్రదీప్‌కుమార్, ట్రెజరర్‌గా ఎండీ ఉమర్, స్పోర్ట్స్ అండ్ కల్చరర్‌గా రంగు శ్రీనివాస్, లైబ్రరీ సెక్రటరీగా ముచ్చకుర్తి కుమారస్వామి, లేడీ రిప్రజంటేటివ్‌గా మహేశ్వరం రాగిణి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా బాస అనురాధ, గుర్రం నారాయణ, జి.ప్రకాశ్, ఆస్మా సుల్తానా, మాట్ల భానుకృష్ణ, పులిపాక రాజ్‌కుమార్, పెట్టం వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.

అర్హులకే డబుల్ బెడ్రూం ఇళ్లు

ఓదెల(పెద్దపల్లి): అర్హులకు మాత్రమే డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేస్తామని పెద్దపల్లి ఆర్డీవో వెంకటమాదవరావు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కునారపు రేణుకదేవి అధ్యక్షతన డబుల్ బెడ్రూం ఇళ్ల మంజూరు లిస్ట్ అవుట్‌పై సమీక్షా సమావేశం జరిగింది. మండలంలో 150 మందిని మాత్రమే డబుల్ బెడ్రూం ఇళ్ల మంజూరుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ప్రస్తుతం 22 గ్రామాల నుంచి 139 మందిని ఇళ్లు లేని వారిని గుర్తించినట్లు వివరించారు. ఇంకా ఎవరైనా ఇల్లు లేనివారు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు.

కులం పేరుతో దూషిస్తే చర్యలు

- సీపీ రెమా రాజేశ్వరి



గోదావరిఖని(రామగుండం): కులంపేరుతో దూషించేవారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి పేర్కొన్నారు. ఈనెల 30న పౌరహక్కుల దినోత్సవం పురస్కరించుకుని పత్రికా ప్రకటన విడుదల చేశారు. డీజీపీ ఆదేశాలతో ప్రతినెలా పౌరహక్కుల దినోత్సవాన్ని కమిషనరేట్ పరిధిలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. కొన్నేళ్ల కిందట కుల వివక్ష ఉండేదని, ప్రస్తుతం అంతగా లేకున్నా అక్కడక్కడ గ్రామాల్లో ఉన్న అసమానతలు, అంటరానితనం, కుల వివక్షను నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ కులాలవారిని చైతన్యపర్చేందుకు గ్రామాల్లో పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పౌరహక్కుల రక్షణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు వివరించారు. అన్ని కులాలకు చెందిన వారితో సమావేశం నిర్వహించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి చట్టం 1989 యొక్క విశిష్టత, పీవోఏ, (పోక్సో చట్టం), పీసీఆర్ (పౌర హక్కుల రక్షణ చట్టం) చట్టాలను అమలు చేసే విధానం గురించి అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురానున్నామన్నారు.

ఖజానా గలగల

- 2022–23లో ప్రభుత్వానికి భారీగా ఆదాయం
- జిల్లాలో కిక్కిచ్చిన లిక్కర్ విక్రయాలు.. జోరుగా రిజిస్ట్రేషన్లు



సాక్షి, పెద్దపల్లి: గతేడాది ఆర్థికసంవత్సరం మొదలైనప్పటినుంచి వివిధ శాఖల ద్వారా ప్రభుత్వ ఆదాయం దెండిగా రావటంతో ఖజానా నిండింది. కరోనా లాక్‌డౌన్ ప్రభావం పూర్తిగా తొలగిపోవడం, రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు, మద్యం అమ్మకాల జోరు.. తదితర వాటితో గతేడాది జిల్లాలో ప్రభుత్వ రాబడి పెరిగింది. ఎప్పటిలాగే ప్రభుత్వానికి మద్యం అమ్మకాలు, రిజిస్ట్రేషన్ శాఖ ద్వారానే ఆదాయం ఎక్కువగా సమకూరింది.

రిజిస్ట్రేషన్ శాఖకు కాసుల వర్షం

జిల్లాలో పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుండగా వీటి పరిధిలో క్రయవిక్రయాలు జోరుగా సాగాయి. జిల్లా కేంద్రం ఏర్పాటుతో రియల్ వ్యాపారం భారీగా జరుగుతోంది. రిజిస్ట్రేషన్ ఫీజులు, భూముల ధరల పెరుగుదల నేపథ్యంలో రికార్డు స్థాయిలో రిజిస్ట్రేషన్లు సాగాయి. పెద్దపల్లి సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 2020లో 7,057 డాక్యుమెంట్‌లు రిజిస్ట్రేషన్‌కాగా రూ.25,19,22,000 ఆదాయం సమకూరింది. 2021లో 13,237 డాక్యుమెంట్‌లు రిజిస్ట్రేషన్ కాగా రూ.44,12,60,000 ఆదాయం వచ్చింది. 2022లో కేవలం 2,594 డాక్యుమెంట్‌లతో రూ.14,39,49,000 ఆదాయం రాగా, ఈఏడాది 9,873 డాక్యుమెంట్స్ రిజిస్ట్రేషన్ చేయగా రూ.51,05,62,000 ఆదాయం వచ్చింది. సుల్తానాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గతేడాది 175 డాక్యుమెంట్స్‌తో రూ.43,56,910 ఆదాయం రాగా, ఈ యేడాది 1,969 డాక్యుమెంట్స్‌తో రూ.6,24,14000 ఆదాయం సమకూరింది. మంథనిలో గతేడాది 1,962 డాక్యుమెంట్స్ రిజిస్ట్రేషన్ చేయగా రూ.4కోట్ల ఆదాయం వచ్చింది. ఈయేడాది 2,085 డాక్యుమెంట్స్ రిజిస్ట్రేషన్ చేయటంతో 4.84 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది.

మద్యం అమ్మకాలతో..

జిల్లాలో 77మద్యం దుకాణాలు, 16 బార్లు ఉన్నాయి. ఎక్సైజ్‌శాఖకు ఏటా పెరుగుతున్న మద్యం అమ్మకాలతో ఆదాయం పెరుగుతోంది. 2020–21లో రూ.627.47కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరగ్గా, 2021–22లో రూ.631.12 కోట్లు, 2022–23లో రూ.622.91కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి.

క్లుప్తంగా

ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేస్తున్న బీజేపీ

- కుట్రపూరితంగానే రాహుల్‌పై అనర్హత
- టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్

పెద్దపల్లిరూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రజాస్వామ్య వ్యవస్థను ఖూనీ చేస్తోందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి. నిరంజన్ ఆరోపించారు. పెద్దపల్లిలో శుక్రవారం బి.రమేశ్‌గౌడ్‌తో కలిసి సమావేశంలో మాట్లాడారు. దేశంలో జోడోయాత్రతో రాహుల్‌గాంధీకి పెరిగిన ఆదరణను చూసి ఓర్వలేక బీజేపీ పాలకులు కుట్రపూరితంగా రాహుల్‌పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దుచేశారన్నారు. ఆ దానీ అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరగకుండా దృష్టి మరల్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని బతికించడానికి కాంగ్రెస్ ఎంతటి పోరాటాలైనా చేస్తోందన్నారు. నాయకులు బి.సురేశ్‌గౌడ్, శ్యాం, శ్రీనివాస్, సునీల్‌గౌడ్, చంద్రశేఖర్, అక్బర్‌అలీ, సర్వర్, వేముల రాజు, పెర్కసంతోష్, విజయ్ తదితరులున్నారు

అనారోగ్య కారణాలతో వ్యక్తి ఆత్మహత్య

ఫెర్టిలైజర్‌సిటీ: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గౌతమినగర్‌లో నివసిస్తున్న సోమారపు సుధాకర్(45) గురువారం క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యకు యత్నించగా చికిత్సపొందుతూ శుక్రవారం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో మృతిచెందాడు. మృతుడు నాలుగేళ్లుగా ఆర్‌ఎఫ్‌సీఎల్ కర్మాగారంలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గత కొన్నిరోజులుగా అనారోగ్య కారణాలతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య సోమారపు రేణుక ఫిర్యాదుతో ఎన్టీపీసీ ఎస్సై జీవన్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నదిలో దూకేందుకు యత్నించిన మహిళ

- కాపాడిన రివర్ పోలీసులు

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరి బ్రిడ్జిపై నుంచి నదిలో దూకేందుకు యత్నించిన ఓ మహిళను(29) శుక్రవారం రివర్ పోలీసులు కాపాడారు. టూటౌన్ రివర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖని గాంధీనగర్ కుచెందిన ఓ వివాహిత కొంతకాలంగా కుటుంబ కలహాలతో బాధపడుతోంది. మనస్థాపానికి గురై శుక్రవారం మధ్యాహ్నం గోదావరి బ్రిడ్జి వద్దకు వెళ్లి నదిలో దూకుతుండగా అక్కడే విధులు నిర్వహిస్తున్న రివర్ కానిస్టేబుల్ సదానందం గమనించి సదరు మహిళను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించి వన్ టౌన్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. సమస్యల్లోంచి బయటపడడానికి ఆత్మహత్యలు పరిష్కారం కాదని, ఆత్మహత్య చేసుకోవడం నేరమని టూటౌన్ సీఐ వేణుగోపాల్ మందలించారు.

మృతదేహం లభ్యం


గుర్తు తెలియని మృతదేహం

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరినదిలో శుక్రవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరి నదిలో జాలర్లు చేపలుపడుతున్న క్రమంలో చేపలవలకు మృతదేహం చిక్కడంతో బయటకు తీశారు. మృతుడి జేబులోని ఆధార్‌కార్డు ప్రకారం శ్రీరాంపూర్‌కు చెందిన శ్రావణపూడి చిట్టి బాబుగా (50) టూటౌన్ పోలీసులు గుర్తించారు. మృతుడి పూర్తి వివరాలకు శ్రీరాంపూర్ పోలీసులకు సమాచారం అందించినట్లు టూటౌన్ ఎస్సై శ్యామ్‌పటేల్ తెలిపారు. మృతదేహన్ని గోదావరిఖని ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వెలుగుల వైపు.. కంటిపరీక్షలు

- జిల్లాలో పూర్తయిన కంటి పరీక్షలు 2,23,126
- 32,824 మందికి రీడింగ్ అద్దాలు పంపిణీ
- ఆర్డర్ ఇచ్చినవి 36,393
- దూరపు చూపు వారికి అందించినవి 10,073
- దృష్టిలోపం ఉన్నవారికి అందించినవి 17,453
- ఏర్పాటుచేసిన బృందాలు 34
- పూర్తయిన శిబిరాలు 201
- రిఫర్ చేసిన వారి సంఖ్య 33,402


సుల్తానాబాద్‌లో 'కంటివెలుగు' శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సంగీత

సుల్తానాబాద్: రాష్ట్రవ్యాప్తంగా జనవరి 18 నుంచి 'కంటివెలుగు' వైద్యశిబిరం రెండో దశ ప్రారంభమైంది. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని జిల్లాలో ముమ్మరంగా నిర్వహించారు. 18 ఏళ్లకు పైబడిన బాధితులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటివెలుగు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కేంద్రాల్లో వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. జిల్లాలో మొత్తం 22, 6 అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, 16 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలుండగా వాటి పరిధిలో 34 బృందాలు నిత్యం గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తున్నాయి. జిల్లాలో మొత్తం 6,64,889 మంది 18 ఏళ్లు నిండిన వారు. 2,23,126 మందికి ఇప్పటి వరకు కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో దగ్గరి చూపు 36,393 మందికి, దూరపు చూపు 17,453 మందికి కంటి అద్దాలు పంపిణీచేశారు.

ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు

జిల్లాలోని పలుప్రాంతాల్లో ప్రభుత్వ ఉద్యోగులకు, పోలీసులకు, మున్సిపల్ కార్మికులకు, జర్నలిస్టులకు, కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు, న్యాయవాదులకు ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటుచేశారు. కంటి పరీక్షల కోసం వచ్చే బాధితులకు ప్రస్తుతం రీడింగ్ అద్దాలు మాత్రమే అందిస్తున్నారు. దగ్గర, దూరం చూపు లోపం ఉన్న బాధితులకు అద్దాలు ఆర్డర్ ఇవ్వడంతో వచ్చిన వారికి వెంటవెంటనే పంపిణీ చేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో కంటివెలుగు శిబిరాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగుతున్నాయి. దూరపు చూపునకు సంబంధించి ఇప్పటి వరకు జిల్లాకు పలు దఫాలుగా 17453 అద్దాలు వచ్చాయి. వీటిని ఫోన్ ద్వారా సమాచారం అందించి శిబిరానికి పిలిపించి అందించారు. శిబిరానికి రాని వారికి ఆశా కార్యకర్తలతో ఇంటికి పంపిస్తున్నారు.

శస్త్రచికిత్సలకు సిఫార్సులు

కంటి శస్త్రచికిత్సలు అవసరమైన బాధితులకు ఎప్పుడు చేస్తారో తెలపడం లేదు. సిఫార్సు మాత్రం చేస్తున్నట్లు రికార్డుల్లో నమోదుచేస్తున్నారు. దీంతో వారు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని బాధితులు తెలుపుతున్నారు. శస్త్రచికిత్సలు అవసరమైన బాధితుల వివరాలు తీసుకుని ప్రభుత్వానికి నివేదిక అందించి శస్త్రచికిత్సలకు ఏర్పాట్లు చేస్తే బాగుంటుందని బాధితులు కోరుతున్నారు.

వార్డులు, గ్రామాల్లో పూర్తి..

జిల్లా మొత్తం 266 గ్రామాలు, 4 పట్టణాల్లో వంద రోజులపాటు 'కంటివెలుగు' కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారు. మార్చి 29 వరకు 201 పట్టణాలు వార్డుల్లో గ్రామాల్లో ఈ కార్యక్రమం పూర్తయింది. 4 పట్టణాలు, గ్రామాల్లో ప్రస్తుతం కొనసాగుతోంది.



దూరపు చూపు అద్దాలు పంపిణీ

దూరపు చుప్పు అద్దాలు పరీక్షలు చేసిన తర్వాత ఆర్డర్ పెడుతున్నాం. ఇప్పటి వరకు 36,393 అవసరం కాగా 17,453 వచ్చాయి. గ్రామాలు, పట్టణాల్లో పంపిణీ చేశాం. కలెక్టర్, డీఈవోతో పాటు నిత్యం ఉన్నతాధికారులు కేంద్రాలను పరిశీలిస్తున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద బాధితులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూస్తున్నాం.
– మహేందర్ వైద్యాధికారి, 'కంటివెలుగు' ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ పెద్దపల్లి.

క్యాటరాక్ట్‌పై ప్రత్యేక దృష్టి

దగ్గరి చూపు సమస్యతో ఉన్నవారికి కంటిఅద్దాలు అందిస్తున్నాం. శుక్లాలు (క్యాటరాక్ట్)తోపాటు ఇతర సమస్యలున్న వారిని గుర్తించి జాబితా సిద్ధంచేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా కార్యక్రమం పూర్తి కాగానే ఆ అంశంపై దృష్టిసారిస్తాం.
– ప్రమోద్‌కుమార్, జిల్లా వైద్యాధికారి, పెద్దపల్లి



నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు


కలెక్టర్ సంగీతకు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు, నాయకులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపాలిటీలో అధికారులు, పాలకులు కలిసి నిధులు దుర్వినియోగం చేస్తున్నారని కాంగ్రెస్ కౌన్సిలర్లు నూగిల్ల మల్లయ్య, తూముల సుభాష్‌రావు, బూతగడ్డ సంపత్, నాయకుడు తాడూరి శ్రీమాన్ శుక్రవారం కలెక్టర్ సంగీతకు ఫిర్యాదు చేశారు. పట్టణప్రగతిలో భాగంగా రూ.కోటి 12లక్షల జనరల్‌ఫండ్ నిధులను ఎజెండా 37 ద్వారా కేటాయించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. ఏటా మొక్కలకు ట్రీగార్డ్స్ పేరిట లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. అలాగే ఎజెండాలోని 50వ అంశంలో చీకురాయి ఆర్‌అండ్‌బీ రోడ్డుకు 15వ ఆర్థికసంఘం నిధులు రూ.80 లక్షల 56వేలు కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. స్టోన్‌వాటర్ డ్రైనేజీ పేరిట రూ.50 లక్షలతో తీర్మానించడం అన్యాయమన్నారు. గతంలో 14వ ఆర్థికసంఘ నిధులకు సంబంధించి రూ.1.68 కోట్ల పనులు ఎందుకు రద్దు చేశారో అంతుబట్టడం లేదన్నారు. మున్సిపల్ నిధుల దుర్వినియోగంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన సీఎం కేసీఆర్

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్


ర్యాలీలో పాల్గొన్న ఎంఎస్ రాజ్‌ఠాగూర్, కార్యకర్తలు

గోదావరిఖని: కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ మోసపూరిత హామీలు, వాగ్దానాలతో ప్రజలను మోసం చేస్తున్నాయని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్ అన్నారు. శుక్రవారం స్థానిక శారదానగర్‌లో పాదయాత్ర నిర్వహించి రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సీఎం కేసీఆర్ దళిత, గిరిజనులకు మూడెకరాల భూమి, పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు, రైతు రుణమాఫీ, నిరోద్యోగ భృతి, ఇలా ఎన్నో హామీలు ఇచ్చి మోసం చేశారన్నారు.

బ్రిటీష్ పాలనను మరిపిస్తోన్న బీజేపీ...

బ్రిటీష్ పాలనను మరిపించే తీరులో మోడీ పాలన కొనసాగుతోందని, ప్రశ్నించే గొంతును అణిచివేయాలని బీజేపీ చూస్తోందని రాజ్‌ఠాగూర్ విమర్శించారు. ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాహుల్‌గాంధీని రాజకీయంగా అణగదొక్కేందుకే పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేశారన్నారు. బీజేపీ చేస్తున్న అన్యాయాలు, అక్రమాలను పార్లమెంట్‌లో రాహుల్‌గాంధీ ప్రశ్నించే అవకాశం లేకుండా దొడ్డిదారిన ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. కేంద్రప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను అందరూ ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

ఇఫ్తార్ విందు...

రామగుండం: పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీ మజీద్‌లో ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. ఉపవాస దీక్షలు మతాల మధ్య బంధుత్వాన్ని పెంచుతాయని, స్నేహానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. ముస్లిం మతపెద్దలు మక్కాన్‌సింగ్‌ను రాబోయే రోజుల్లో రాజకీయంగా ఎదగాలని ఆశీర్వదించారు.

ఎన్నికల హామీలు అమలు చేసేదెప్పుడు


సమావేశంలో మాట్లాడుతున్న విజయరమణారావు

ఎలిగేడు(పెద్దపల్లి): ఎలిగేడు మండల కేంద్రానికి పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేస్తామని గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి నేటికీ అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందని పీసీసీ ఉపాధ్యక్షుడు చింతకుంట విజయరమణారావు ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన దీక్ష శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడారు. మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, 50 పడకల ఆసుపత్రి ఏర్పాటు, తదితర హామీలను గత ఎన్నికల్లో నేతలు ఇవ్వగా నేటికీ నీటిమీద రాతగానే మిగిలాయని విమర్శించారు. పెద్దపల్లి బస్టాండ్ నుంచి తన కాలేజీకి వేసుకున్న రోడ్ ఇతర గ్రామాల్లో ఉందా, ఎలిగేడు మండలానికి ఎన్ని సీసీ రోడ్లు వచ్చాయి..ఎన్ని కంప్లీట్ చేశారు అని ప్రశ్నించారు. అసమర్థపు ఎమ్మెల్యే వారి పార్టీవారికే సంక్షేమ పథకాలు ఇచ్చుకుంటు పోతే పేద ప్రజల పరిస్థితి ఏమిటి అని అన్నారు. కాంగ్రెస్ నాయకుడు వేముల రామ్మూర్తి, విజయరమణారావుకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, కళ్లేపల్లి జానీ, అంతటి అన్నయ్యగౌడ్, గోపగాని సారయ్యగౌడ్, మినుపాల ప్రకాశ్‌రావు, దామోదర్‌రావు, నుగిల్ల మల్లన్న, సాయిరి మహేందర్, సయ్యద్ మస్రత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో పాలకులు విఫలం


సమస్యలు తెలుసుకుంటున్న గొర్రె రమేశ్

పాలకుర్తి: రామగుండం నియోజకవర్గ పరిధిలో ప్రజల సమస్యలు పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారని తెలంగాణ లేబర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గొర్రె రమేశ్ అన్నారు. శుక్రవారం పాలకుర్తి మండలకేంద్రంతో పాటు బసంత్‌నగర్, ఈసాలతక్కళ్లపల్లి, బక్కరాజంపల్లి గ్రామాల్లో 'పల్లెబాట' కార్యక్రమంలో పాల్గొని గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గొర్రె రమేశ్ మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ కళాశాల లేకపోవడంతో ఉన్నత చదువులకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాలకుర్తి మండలకేంద్రంగా ఏర్పడి ఏడేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ మండల కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించలేదని ఇది ఖచ్చితంగా అధికార పార్టీ నాయకుల అలసత్వమేనన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ లేబర్ పార్టీ తరఫున పోటీచేస్తున్న తనను గెలిపిస్తే రామగుండం నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు కొయ్యడ శివరాం, తిరుపతి, గాజుల రమేశ్, జక్కం కవిత, పొన్నం రజిత, అఖిల్‌వర్మ, మానస, సరిత తదితరులు పాల్గొన్నారు.

సంపులో పడి యువకుడు మృతి


నీటి సంపులో పడి మృతిచెందిన సతీశ్

శంకరపట్నం: మండలంలోని వంకాయగూడెం గ్రామంలో శుక్రవారం నీటి సంపులో పడి ఇజ్జిగిరి సతీశ్(33) యవకుడు మృతిచెందినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. సతీశ్ పోలియో బాధితుడు కావడంతో శుక్రవారం తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చారు. ఇంట్లో సతీశ్ కనిపించకపోవడంతో సంపులో చూడగా శవమై కనిపించాడు. ఇంటి ముందున్న నీటి సంపులో పడి మృతిచెందినట్లు మృతుడి తండ్రి ఐలయ్య ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

'మంథని' పదిలమేనా..?

- గోదావరిఖనికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మంజూరుపై ఆందోళన
- తరలిస్తారనే అనుమానాలు


మంథని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

మంథని: జిల్లాలో కొత్తగా గోదావరిఖనికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మంజూరు కావడంతో మంథని కార్యాలయం పదిలమేనా..? లేక ఎక్కడికైనా తరలిస్తారా అనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఏడాది క్రితం మంథని కార్యాలయాన్ని తరలించేందుకు ప్రయత్నాలు జరిగాయనే ప్రచారం జరిగింది. తాజా పరిణామాల నేపథ్యంలో ఈ ప్రాంతవాసుల్లో అనుమానాలు కల్గుతున్నారు. కాగా జిల్లాల పునర్వీభజన, రెవెన్యూ భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ బదాలాయింపు జరిగి మంథని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల నమోదు మందగించింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమయంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో మంథనితో పాటు ముత్తారం, మల్హర్, కాటారం, మహాముత్తారం, మహాదేవపూర్లకు సంబంధించి రిజిస్ట్రేషన్ ఇక్కడే జరిగేది. ఈ క్రమంలో నిత్యం 40–50 రిజిస్ట్రేషన్లు ఇక్కడ జరిగేవి.

నాలుగు మండలాలు.. రోజుకు పదే రిజిస్ట్రేషన్లు

మంథని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో మంథనితో పాటు ముత్తారం, కమాన్‌పూర్, రామగిరి మండలాలు మాత్రమే ఉన్నాయి. ప్రస్తుతం ఇక్కడ రోజుకు పది రిజిస్ట్రేషన్లు మాత్రమే జరుగుతున్నాయి. ప్లాట్ల రిజిస్ట్రేషన్లతో పాటు వివాహాల నమోదు చేసుకుంటున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కేవలం 2,085 రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగాయి. రూ.4.84 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ క్రమంలో రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గడమే కాకుండా ఆదాయం కూడా అంతంత మాత్రంగానే ఉండడంతో మంథనిని గోదావరిఖని లేదా పెద్దపల్లిలో కలుపుతారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బొగ్గుబాయి వార్తలు

120 శాతం బొగ్గు ఉత్పత్తి

- నంబర్‌వన్‌గా నిలిచిన ఆర్జీ–1 ఏరియా
- జీఎం కె.నారాయణ వెల్లడి


మాట్లాడుతున్న జీఎం

గోదావరిఖని: 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఆర్జీ–1 ఏరియా 120శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు జీఎం కె.నారాయణ వెల్లడించారు. శుక్రవారం జీఎం కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉత్పత్తి లక్ష్యసాధనలో జీడీకే–5 ఓసీపీ అగ్రగామిగా నిలిచిందన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 39.05లక్షల టన్నుల లక్ష్యానికిగాను 47 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి సింగరేణిలోనే నెంబర్‌వన్‌గా ఆర్జీ–1 ఏరియా నిలిచిందన్నారు. ఏరియాలోని జీడీకే–11గని కంటిన్యూస్ మైనర్ యంత్రాలతో భారీగా ఉత్పత్తి సాధించామన్నారు. ఒక్క మార్చి నెలలో 175 శాతం ఉత్పత్తి సాధించి రికార్డు నెలకొల్పామన్నారు. ఇందుకు సహకరించిన ప్రతీ ఒక్కరికి అభినందనలు తెలిపారు. తాను జీఎంగా పనిచేసిన మూడేళ్లలో సహకరించిన ఉద్యోగులు, అధికారులు, కార్మిక సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి సంస్థ పురోగాభివృద్ధిలో పాలుపంచుకోవాలన్నారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

ఆర్జీ–1 జీఎంగా చింతల శ్రీనివాస్


శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కె.నారాయణ

గోదావరిఖని: ఆర్జీ–1 జీఎంగా చింతల శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు నూతన జీఎంకు ప్రస్తుతం ప నిచేస్తున్న జీఎం కె.నారాయణ పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం శ్రీనివాస్ జీఎంగా బాధ్యతలు చే పట్టారు. మందమర్రి జీఎంగా పనిచేస్తున్న శ్రీని వాస్‌ను ఆర్జీ–1కు బదిలీచేశారు. ప్రస్తుతం ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 ప్రాజెక్టు అధికారిగా పనిచేస్తున్న మోహన్‌రెడ్డి మందమర్రి జీఎంగా పదోన్నతిపై బదిలీచేశారు.

బీఎంఎస్‌లో చేరిన కాంట్రాక్టు కార్మికులు


కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న సత్తయ్య


గోదావరిఖని: సింగరేణి కాంట్రాక్టు కార్మికులు శుక్రవారం బీఎంఎస్‌లో చేరారు. వీరికి రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంటాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని, కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల సంరక్షణకు నిరంతరం పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకుల హరిణ్, తాట్ల లక్ష్మయ్య, రాపోలు వజ్రవేణు, జనగామ రాయలింగు, గుండెబోయిన భూమయ్య, బానోతు రంజిత్‌కుమార్, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత, పచ్చదనంలో 'సుల్తాన్'పూర్


మంత్రులచేతులమీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్ వెంకటేశ్వర్‌రావు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని సుల్తాన్‌పూర్ పంచాయతీ రాష్ట్రస్థాయిలో పచ్చదనం..పరిశుభ్రత అంశంలో ఉత్తమ పంచాయతీగా ఎంపికైంది. ఉత్తమ సర్పంచ్‌గా ఎంపికైన సుల్తాన్‌పూర్ సర్పంచ్ వెంకటేశ్వర్‌రావుకు రాష్ట మంత్రులు కేటీఆర్, దయాకర్ రావు శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీచైర్మన్ పుట్టమధు, స్థానికసంస్థల అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, డీఆర్‌డీవో శ్రీధర్ తదితరులున్నారు. ఎలిగేడు మండలంలోని సుల్తాన్‌పూర్ పంచాయతీ 1,2,5,9 అంశాల్లో ప్రతిభచూపి అగ్రభాగాన నిలిచింది. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో ఎంపికై న సుల్తాన్‌పూర్ పంచాయతీ జాతీయ స్థాయిలో అవార్డు కోసం పోటీపడుతోంది. పెద్దపల్లి జిల్లాకు మరోసారి సుల్తాన్‌పూర్ పంచాయతీ జాతీయస్థాయిలో గుర్తింపు లభిస్తుందన్న ఆశతో జిల్లావాసులు, అధికారులున్నారు.

2న 'గవాయి'కి సినారె సాహితీ పురస్కారం


గవాయి పుస్తకం


దేవేందర్

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్ జిల్లాకు చెందిన ప్రఖ్యాత కవి రచయిత, ప్రముఖ కవి అన్నవరం దేవేందర్ 'గవాయి' కవితా సంపుటికి సినారె సాహితీ పురస్కారం ప్రదానం చేస్తున్నట్లు సాహితీ గౌతమి ప్రధానకార్యదర్శి నంది శ్రీనివాస్ తెలిపారు. ఏప్రిల్ 2 ఆదివారం సాయంత్రం కరీంనగర్ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో పురస్కారోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'గవాయి' కవితా సంకలనం 2021 సంవత్సరానికి 32వ పురస్కారం అన్నారు. కరీంనగర్ జిల్లా సాహితీ సంస్థల సమాఖ్య 'సాహితీ గౌతమి' నిర్వహిస్తున్న ఈ సభకు పురస్కార కమిటీ అధ్యక్షుడు ప్రముఖ పిల్లల వైద్యుడు డాక్టర్ ఎడవెల్లి విజయేందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నారని ముఖ్యఅతిథిగా తెలంగాణ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు. దేవేందర్ ఇప్పటివరకు 12 కవితా సంపుటాలు, రెండు వ్యాస సంకలనాలు మరో రెండు ఇంగ్లిష్ అనువాద కవిత్వ సంకనాలు వెలువరించారు. వీరికి గతంలో తెలుగు విశ్వవిద్యాలయ సాహిత్య పురస్కారం, తెలంగాణ సారస్వత పరిషత్ సాహిత్య పురస్కారంతో పాటు మరెన్నో పురస్కారాలు అందుకున్నారు.